క్లుప్తంగా

భావనారుషేశ్వరస్వామి కల్యాణం నేడు



కొత్తపేటలో భావనారుషేశ్వరస్వామి వారు

రాంబిల్లి: కొత్తపేటలో గురువారం శ్రీ భద్రావతి సమేత భావనారుషేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శూలాల ఉత్సవం, పూజలు నిర్వహించారు. గురువారం భారీ అన్న సమారాధనతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్సర్ బైక్ సింగర్ రమణ గేయాలాపన, కండక్టర్ ఝాన్సీ డ్యాన్స్ ప్రోగ్రాం అలరించాయి. మిరుమిట్లు గొలిపే బాణసంచా, విద్యుద్దీపాలంకరణ కనువిందు చేశాయి. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీమహాలక్ష్మి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం

కోటవురట్ల: స్థానిక బీసీ కాలనీలో శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద బుధవారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తుల తాకిడితో సందడిగా మారింది. సమీప గ్రామాల నుంచి పెద్ద పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం తీర్థంలో సందడి చేశారు. అమ్మవారికి అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: ఉపాధిహామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పిలుపునిచ్చారు. వాడ్రాపల్లిలో ఉగాది సందర్భంగా ఉపాధిహామీ పథకం పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకంలో పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు.

అలరించిన జానపద నృత్యాలు

రాంబిల్లి: దిమిలిలో నిర్వహించిన రేలా రేరేలా జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కొత్త అమవాస్య నూకాంబిక జాతర సందర్భంగా మంగళవారం రాత్రి రేలా రేరేలా జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. విజయనగరానికి చెందిన కళాకారులు జానపద నృత్యాలతో అలరించారు. దిమిలి పరిసర గ్రామాల ప్రేక్షకులు కళాకారులను అభినందించారు.

వెంకన్న ఆలయంలో లక్ష మల్లెల పూజ



కల్యాణ వేంకటేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజ నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఎస్.రాయవరం : దార్లపూడి శ్రీ వరహా శేషాద్రిపై వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్ష మల్లెలు పూజ నిర్వహించారు. తెలుగు సంవత్సరాది వేడుకను పురస్కరించుకుని ప్రతి ఏడాది స్వామికి లక్ష మల్లెలు పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ప్రధానార్చకులు రేజేటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 10 మంది వేద పండితుల సమక్షంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల వారు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని లక్ష మల్లెలు పూజ నిర్వహించారు.

సందడిగా చిలకల తీర్థం

- పేరంటాలమ్మను దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు
- జోరుగా పంచదార చిలకలు, రంగుల చేటల కొనుగోళ్లు



పాయకరావుపేటలో చిలకల తీర్థానికి పోటెత్తిన భక్తులు



తిరునాళ్లలో పంచదార చిలకల అమ్మకాలు

పాయకరావుపేట: మంగవరం రోడ్డులో ఉన్న పేరంటాలమ్మతల్లి ఆలయం వద్ద ఉగాదినాడు జరిగిన చిలకల తీర్థానికి సందర్శకులు పోటెత్తారు. మలిపెద్ది వారి ఇలవేల్పు అయిన పేరంటాలమ్మను దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. తిరునాళ్లలో పంచదార చిలకలు, రంగురంగుల చేటలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేట లక్ష్మి థియేటర్ జంక్షన్ నుంచి తుని గొల్ల అప్పారావు జంక్షన్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తీర్థం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభమైన తిరునాళ్ల రాత్రి 11గంటలవరకు కొనసాగాయి.

ఘనంగా ఉగాది సంబరాలు



పంచదార్లలో పూజలు, పంచాంగ శ్రవణం



పూజలందుకున్న శ్రీ సీతారామస్వామి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

రాంబిల్లి : మండలంలో ఉగాది సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని పంచుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పంచదార్ల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిమిలి రామాలయంలోనూ పంచాంగశ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురోహితులు కొత్త సంవత్సరంలో రాశులు వాటి ఫలితాలను వివరించారు.

ఎస్.రాయవరం : మండలంలో ఉగాది పర్వదినం వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు శ్రీ సీతామస్వామి, దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి, వమ్మవరం శ్రీ స్వయంబు శ్రీ వేంకటేశ్వర స్వామి, రేవుపోలవరం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. కొరుప్రోలు, రేవుపోలవరం గ్రామాల్లో పంచాగ శ్రవణం చేశారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

కోటవురట్ల: మండలంలో ఉగాది పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్త సంవత్సరాది శుభకృత్ నామ సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోటవురట్లలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

మునగపాక : మండలంలో బుధవారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాది పండగ నేపథ్యంలో ఉగాది పచ్చళ్లు తయారు చేసి ఇంటిల్లపాది స్వీకరించడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని వారికి పంచిపెడుతూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గవర్ల అనకాపల్లిలోని నూకాంబిక అమ్మవారిని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొన్నారు.

పైడమ్మ బంద ఆయకట్టు రైతులకు తీపి కబురు



వ్యవసాయ బోరు నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని లుపిన్ ఫార్మా యాజమాన్యం సౌజన్యంతో పరవాడ పైడమ్మ బందలో ఏర్పాటు చేయనున్న బోరు నిర్మాణ పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. పైడమ్మ బంద ఆయకట్టు రైతులు పంటలకు నీరందక పదుల ఎకరాల విస్తీర్ణంలో పంటలు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని పొలంబడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వ్యవసాయాధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. అధికారులు సమస్యను లుపిన్ ఫార్మా యాజమాన్యానికి వివరించారు. స్పందించిన లుపిన్ ఫార్మా యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న పైడమ్మ బందలో వ్యవసాయ బోరు నిర్మించడానికి వీలుగా రూ.1.95 లక్షలు మంజూరు చేశారు. వర్క్ ఆర్డర్ ప్రతులను పరిశ్రమ సీఎస్సార్ మేనేజర్ దక్కిన వెంకటనారాయణ బుధవారం రైతు ప్రతినిధులకు అందజేశారు. దీంతో పనులు ప్రారంభించారు. వార్డు సభ్యుడు సిరపరపు రాజేష్, పైడి బంద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు గండి నమో, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు కె.చినబాబు, రైతులు ఎస్.ఎస్.నాయుడు, ఎస్.సన్యాసినాయుడు, పైల మురళి, ఎస్.సన్యాసినాయుడు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి కుంకుమార్చనలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉగాది పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట నేడు



బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయం

పరవాడ : ఇ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9.57 గంటలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కొండకర్లలో ఎల్లారమ్మ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో కొండకర్ల గ్రామంలో ఎల్లారమ్మపేరంటాల పండగ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు భారీగా అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

'అప్‌డేట్' కాకుంటే.. 'ఆధార'ం లేనట్టే

- ఆధార్ కార్డు అప్‌డేట్ గడువు జూన్ 14
- ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితం
- సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు



సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

తుమ్మపాల: మీరు ఆధార్ కార్డు పొంది పదేళ్లు గడిచాయా.. అయితే వెంటనే ఆధార్ అప్‌డేట్ చేసుకోండి. లేదంటే ఆగస్టు నెలతో మీ ఆధార్ కార్డు పనికిరాకుండా పోతుంది. అదే జరిగితే పరిస్థితేంటో.. ఒకసారి ఆలోచించుకోండి. ప్రస్తుతం మన బతుకులన్నీ ఆధార్‌కార్డు మీదే ఆధారపడి ఉన్నాయి. బ్యాంకింగ్ సేవలతోపాటు, ప్రభుత్వాలిచ్చే సంక్షేమ పథకాలు, దైనందిన కార్యకలాపాలన్నింటికీ ఇక్కట్లు తప్పవు. అందుకే తక్షణమే మీ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం కోరుతోంది.

ఉచితంగానే ఆధార్ అప్‌డేట్

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగక్కర్లేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈ నెల 15 నుంచి, జూన్ 14 వరకు.. మూడు నెలల పాటు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. మీ ఇంట్లో ఉన్న కంప్యూటర్లో వెబ్‌సైట్ ద్వారా లేదా.. మొబైల్‌లో ఎంఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుములు చెల్లించక్కర్లేదు. అరచేతిలోనే ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించింది. బ్యాంకులు, కామన్ సర్వీస్ కేంద్రాలు, సచివాలయాల్లో నిర్ణీత ఫీజుతో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు.

ఆధార్ కార్డు గడువు ఆగస్టు 31

2010 నుంచి 2016 మధ్య కాలంలో ఆధార్ కార్డు పొందిన వాళ్లు తమ ఆధార్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ కార్డు నమోదు సమయంలో కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక అప్లికేషన్‌తో ఆధార్ మంజూరు చేశారు. అలాంటి వారు తప్పకుండా తమ గుర్తింపు పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఆధార్‌కు జతచేసి, డాక్యుమెంట్ అప్‌డేషన్ చేసుకోవాలి. అలా అప్‌డేట్ చేసుకోని కార్డుల్ని ఈ ఏడాది ఆగస్టు 31తర్వాత చెల్లుబాటులో లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మార్పులు, చేర్పులకు అవకాశం

ప్రస్తుత అప్‌డేషన్లో భాగంగా ఆధార్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉంది. చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డు, బ్యాంక్/పోస్టల్ పాస్‌బుక్, ఫొటోతో కూడిన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ/ఆయుష్మాన్ భారత్ కార్డు, గుర్తింపు పొందిన విద్యా సంస్థలు జారీ చేసే పత్రాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు తదితర 13 రకాల ధ్రువపత్రాల ద్వారా ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ ఆధార్ అప్‌డేట్



ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ పొందిన పదేళ్ల వ్యవధిలో ఎప్పుడైనా ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకుంటే.. అలాంటి వారికి పర్లేదు. పదేళ్లలో ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారికి మాత్రం తప్పనిసరి. ఇలాంటి వారి కోసం మండలంలో ఆధార్ కిట్లు వచ్చిన 12 సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. వీటి సాయంతో అన్ని సచివాలయాలకూ ఈ ఆధార్ శిబిరాలను విస్తరిస్తాం.

– కె.ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, అనకాపల్లి

ఉత్సవ పల్లకి బహూకరణ



గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి అందించిన పల్లకీతో దాతలు

కశింకోట : స్థానిక గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ పల్లకీని భక్తులు బహూకరించారు. ఆళ్ల త్రినాథ్ జ్ఞాపకార్థం భార్య నూకరత్నం, కుటుంబ సభ్యులు దీన్ని బుధవారం అందజేశారు. ఇక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా వైకుంఠ ఏకాదశి రోజున కల్యాణోత్సవం, రామాలయంలో శ్రీరామనవమి రోజు సీతారామ కల్యాణోత్సవం భారీగా జరుగుతాయి. ఆయా రోజుల్లో ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలకు కోసం ఉపయోగపడేలా దీన్ని రూపొందించి, అందించినట్లు దాతలు తెలిపారు.

ఘనంగా మంత్రి రాజా జన్మదిన వేడుకలు



రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజాను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా జన్మదిన కార్యక్రమం పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా హాజరై జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం మండలంలో గల పలువురు నాయకులు మంత్రి రాజాను గజమాలతో సత్కరించారు. అనంతరం నాయకులు వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షుడు బాబూరావు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నక్కపల్లి : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం నక్కపల్లికి చెందిన పలువురు ముఖ్య నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాయకరావుపేట పంచాయతీరాజ్ విశ్రాంతి గృహానికి వచ్చిన మంత్రిని మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, తదితరులు ఉపమాక వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకగా సీతారాముల పెళ్లిరాట



మునగపాకలో సీతారాముల పెళ్లిరాటలో భక్తులు



యలమంచిలి పాత వీధిలో రామాలయం వద్ద సీతారాముల పెళ్లి రాట వేస్తున్న భక్తులు

మునగపాక : స్థానిక రామాలయం ఆవరణలో బుధవారం సీతారాముల పెళ్లిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈనెల 30న జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పెద్దలు పెళ్లిరాట వేశారు. వేపచెట్టుకు మహిళలు పసుపు, కుంకుమ అద్ది అనంతరం రాట కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఆలయ అర్చకులు, రేజేటి కుటుంబ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యలమంచిలిలో...

యలమంచిలి: పట్టణంలో పాత వీధిలోని రామాలయం వద్ద సీతారాముల పెళ్లి రాట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పట్టణ ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని సీతారాముల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. ప్రజలందరూ రాశి ఫలాలును చూపించుకున్నారు. రామాలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముసిలితల్లి అమ్మవారి సారె ఊరేగింపు



అరబుపాలెంలో ముసిలితల్లి అమ్మవారి సారె ఊరేగింపు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని అరబుపాలెం గ్రామంలో బుధవారం ముసిలితల్లి అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో సారె ఊరేగింపుతో బయలుదేరారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మహిళలు తయారు చేసిన పలు రకాల పండి వంటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,ఆలయ చైర్మన్ కొయిలాడ గంగాధర్, కార్యదర్శి లక్ష్మణరావు, పాలసంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, సచివాలయ కన్వీనర్ కూర్మారావు, గ్రామపెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ



విజేతకు బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీరామ్మూర్తి

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శ్రీ శుభకృత్ నామ సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లికల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో తమరాన గాయత్రి ప్రథమ, దేవాడ రమ్య ద్వితీయ, అయినపర్తి భవానీ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.1500 నగదు అందించారు. మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, ఎం.సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో పూజలు అందుకున్న లలితాంబిక

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ఠ గావించి, లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖాచిత్రం మధ్యలో అధిష్ఠింపజేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం జరిపారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్‌చంద్ మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్యతోపాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోంలో అన్నదానం

అనకాపల్లిటౌన్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్టు అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాలతి షణ్ముఖ్ అన్నారు. మండలంలోని వెంకుపాలెంలో ఉన్న దయ చిల్డ్రన్స్ హోమ్‌లో బుధవారం చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్టు వ్యవస్థాపకులు పి.డి.సుందరరావు పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మీశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కరుణప్రియ, సహాయ కార్యదర్శి సలోమి ఇమాన్యుయేల్, కోశాధికారి సూర్యకళ వెంకట్, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ లెక్చరర్ ఎ.ధరణి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, అచ్యుతాపురం

ఆర్.సి.నెం: 03/2023 — తేది 21-03-2023

వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం అచ్యుతాపురం గ్రామ పంచాయతీ స్వాధీనములో గల 1) వారపు సంత, 2) రోడ్డు మార్జిన్ వ్యాపారం మరియు 3) కొబ్బరి చెట్ల ఫలసాయం 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఆశీలు వసూలు చేసుకునే హక్కు నిమిత్తం తేది 29-03-2023 ఉదయం గం॥ 11-00లకు అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు బహిరంగ వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచినవారు ఈ దిగువ షెడ్యూల్‌లో తెలిపిన విధముగా ధరావత్తు పంచాయతీ కార్యదర్శి అచ్యుతాపురం పేరుతో చెల్లుబాటు అయ్యే విధముగా DD (లేదా) Amount రూపంలో చెల్లించి పాట కాలమందు అందచేయవలెను. మరియు మండల తహసీల్దార్ వద్ద నుండి రూ. 5,00,000/- (అక్షరముల ఐదు లక్షల రూపాయలు మాత్రమే)నకు పొందిన ప్రస్తుత సంవత్సరపు సాల్వెన్సీ ధృవపత్రము దాఖలు చేయవలెను. మిగిలిన వివరములను ఈ కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ. సం.	పాట వివరములు	కాలము (2023-2024)	డిపాజిట్ మొత్తం (DD/Amount)	సాల్వెన్సీ ధృవపత్రము	రిమార్కులు
1.	వారపు సంత	2023-2024	రూ.1,00,000/-	రూ.5,00,000/-	
2.	రోడ్డు మార్జిన్ వ్యాపారం	2023-2024	రూ.20,000/-	-	
3.	కొబ్బరి చెట్ల ఫలసాయం	2023-2024	రూ.3,000/-	-	

ముఖ్య గమనిక:

1) ఆశీలు వసూలు చేసుకొనే హక్కు పొందే గుత్తేదారు వేలంపాట సొమ్ముకు ప్రభుత్వము వారు నిర్ణయించిన ప్రకారము అగ్రిమెంటు స్టాంపులు ఖరీదు చేసి షరతులు లోబడి అగ్రిమెంటు ఇవ్వవలెను.
2) వేలం నోటిఫికేషన్‌లోని షరతులు, హద్దులు, రేట్లు ప్రకారం గుత్తేదారు నడుచుకొనవలెను.
3) వేలంపాటను ఆమోదించుటకు గాని తిరస్కరించుటకు గాని గ్రామ పంచాయతీకి అధికారము కలదు.
4) అచ్యుతాపురం గ్రామ పంచాయతీ ఏరియాలో జరుపు వ్యాపారములు మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనవలసియుండును.
5) వాతావరణ, ఇతర పరిస్థితుల వలన సంభవించు లాభనష్టములకు గ్రామ పంచాయతీకి ఎటువంటి బాధ్యత లేదు.

కె.అమ్మాజీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అచ్యుతాపురం